

గంజాయి నేరస్తులకు జైలు

విద్యార్థులు, యువకులకు గంజాయి విక్రయించే వారికి జైలుశిక్ష తప్పదని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. - 8లో..



గేట్ల మరమ్మతుల్లో జాప్యం చేయొద్దు

గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్ల మరమ్మతుల్లో జాప్యం చేయొద్దని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. శుక్రవారం గుండ్లకమ్మ ప్రాజెక్టును పరిశీలించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 37/29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనాలు

ఒంగోలు సెంట్రల్: కేంద్ర ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక ఉపకార వేతనాలు మంజూరు చేస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జీ అర్చన తెలిపారు. ప్రీ మెట్రిక్ విద్యార్థులు 9 నుంచి పది తరగతులు చదువుతున్న వారు ఈ ఉపకార వేతనాలకు అర్హులని చెప్పారు. ఆగస్టు 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్, ఆపై తరగతులు (పోస్ట్ మెట్రిక్) చదువుతున్న విద్యార్థులు అక్టోబర్ 31వ తేదీలోపు కేంద్ర వెబ్‌సైట్‌లో 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబిలిటీస్'లో మాత్రమే దివ్యాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అన్ని అర్హతలు ఉన్న దరఖాస్తులను పరిశీలించి విద్యార్థులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో ఉపకార వేతనాలు జమ చేస్తారని చెప్పారు. కేంద్ర వెబ్‌సైట్ అడ్రస్: www.depwd.gov.in http:scholarships.gov.in deparment of Empowerment of Persons with Disabilitesలో దరఖాస్తు చేసుకోవాలని, జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్ మెరిట్ జాబితా వెబ్‌సైట్‌లో

ఒంగోలు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ ప్రవేశ పరీక్ష 2023 డిసెంబర్ 3న జరిగిందని, అందులో ప్రతిభ కనబరిచిన వారి జాబితా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈవో డి.సుభద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి వారి మెరిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకుని వారిపేరు, పుట్టిన తేదీ, తండ్రి లేదా తల్లిపేరు, వారి ఆధార్‌లో ఉన్న విధంగా ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా ఉందో లేదో సరిచూసుకోవాలన్నారు. సరిగానే ఉన్నట్లయితే విద్యా మంత్రిత్వశాఖ, న్యూఢిల్లీ వారి స్కాలర్‌షిప్ పోర్టల్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.స్కాలర్‌షిప్స్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆగస్టు 31లోగా దరఖాస్తు సమర్పించి, సంబంధిత పాఠశాల నోడల్ అధికారి, జిల్లా నోడల్ అధికారి లాగిన్‌ల ద్వారా అప్రూవ్ చేయించుకోవాలన్నారు. విద్యార్థిపేరు, తండ్రిపేరు, పుట్టిన తేదీ మెరిట్ కార్డులో ఉన్న విధంగానే ఆధార్‌కార్డులో కూడా ఉండాలన్నారు. వివరాలు సరిపోకపోతే విద్యార్థులు వెంటనే ఆధార్ మిస్‌మాచ్ వివరాలను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి పంపాలన్నారు. తప్పనిసరిగా విద్యార్థి ఆధార్ బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయించుకోవాలని, సంబంధిత బ్యాంకు ఖాతాకు స్కాలర్‌షిప్ నేరుగా జమవుతుందన్నారు.

నోటి క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం అవశ్యం

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏడుకొండలు



శిక్షణలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డా. ఏడుకొండలు

ఒంగోలు టౌన్: నోటి క్యాన్సర్‌ను సాధ్యమైనంత త్వరగా గుర్తించాల్సిన అవసరం ఉందని, లేకపోతే క్యాన్సర్ మహమ్మారి దేహమంతా పాకి ప్రాణాలను బలిగొనే ప్రమాదం ఉంటుందని ప్రివెంటివ్ ఆంకాలజీ నోడల్ అధికారి, ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏడుకొండలు చెప్పారు. జీజీహెచ్ మెడికల్ కాలేజీ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం క్యాన్సర్ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ హ్యూమన్ పాపిలోమా వైరస్ కారణంగా వస్తుందని, ఇది సోకిన 10 నుంచి 15 ఏళ్ల తరువాత క్యాన్సర్‌గా మారుతుందని తెలిపారు. 9 నుంచి 14 ఏళ్ల లోపు హెచ్‌పీవీ వ్యాక్సిన్ చేయిస్తే ఈ క్యాన్సర్‌ను నివారించవచ్చని చెప్పారు. 30 ఏళ్ల వయసు దాటిన మహిళలు ఎలాంటి లక్షణాలు కనిపించక పోయినా పలు రకాల పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. వివాహిత మహిళలు ప్రతి ఏడాది పాప్‌స్మియర్ పరీక్షలను చేయించుకోవాలని ఎన్‌సీడీ నోడల్ అధికారి డా.భగీరథి చెప్పారు. తొలిదశలోనే క్యాన్సర్‌ను గుర్తించగలిగితే గర్భాశయ క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేయవచ్చని డా.శ్రీదేవి అన్నారు. కౌమర దశలో ఉన్న బాలికలకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని, దీనివలన 80 శాతం వరకు గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ రాకుండా చేయవచ్చని తెలిపారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జరుగుతున్న క్యాన్సర్ శిక్షణలో ఇప్పటి దాకా జిల్లాకు చెందిన 960 మంది వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు శిక్షణ పొందారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.తిరుమల రావు, జిల్లా క్యాన్సర్ రిసోర్స్ పర్సన్లు డా.నరేంద్ర, డా.నబి, డెంటల్ సర్జన్ డా.రమ్య, గైనకాలజిస్టులు డా.హేమసుధ, డా.శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతు ఇంట కాసుల పంట

దశాబ్దాలుగా పొగ సూరిన రైతు బతుకుల్లో ధరలు పెరిగి సిరులు ఒలుకుతున్నాయి. ఎన్నడూలేనంతగా ఈ దఫా ధరలు అదరగొడుతున్నాయి. వేలం ప్రారంభం నుంచే ఊహించని విధంగా ధరలు పలుకుతుండడంతో రైతులకు లాభాలే లాభాలు. ఈ ఏడాది కేజీ ధర గరిష్టంగా గతంలో ఎప్పుడూ రానంతగా ధర రూ.366 వచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ ఉండడంతో మూడు సంవత్సరాలుగా వరుసగా రైతులకు సిరులను కురిపిస్తోంది. ఒక్కో బ్యారన్‌కు సుమారు రూ. 6 లక్షల నుంచి 8 లక్షల మేర లాభాలు వచ్చాయి. ఇప్పటి వరకు 89.12 మిలియన్ కేజీలు కొనుగోలు చేయగా, అదనంగా 40 మిలియన్ కేజీలు కొనుగోలుకు అధికారులు పొగాకు బోర్డుకు లేఖ రాశారు.

- మూడేళ్లుగా లాభాలు
- ఒక్కో బ్యారన్ రైతుకు రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల మధ్య లాభం
- పొగాకు ఉత్పత్తికి అనుమతిచ్చింది 88.75 మిలియన్ కేజీలు
- ఉత్పత్తి చేసింది 139 మిలియన్ కేజీలు
- కొనుగోలు చేసింది 89.12 మిలియన్ కేజీలు
- ఇంకా మిగిలిన పొగాకు 40 మిలియన్ కేజీలు
- అదనపు పొగాకు కొనుగోళ్లకు ఢిల్లీకి రాష్ట్ర పొగాకు బోర్డు విజ్ఞప్తి



వేలం కేంద్రంలో పొగాకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

సాక్షిప్రతినిధి, ఒంగోలు: ప్రకాశం రీజియన్ పరిధిలో 11 పొగాకు వేలం కేంద్రాలున్నాయి. మొత్తం 30,340 మంది రైతులు ఈ ఏడాది 72 వేల హెక్టార్లలో పొగాకు సాగు చేశారు. వాస్తవానికి రైతులు పొగాకు సాగు చేసుకోవడానికి 58,800 హెక్టార్లకు మాత్రమే అనుమతిచ్చింది. దాని ద్వారా 88.75 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలుకు మాత్రమే బోర్డు అనుమతిచ్చింది. కానీ, ఇప్పటికే 89.12 మిలియన్ కేజీలు కొనుగోలు చేసింది. ఇంకా రైతులు అనధికారికంగా పండించిన పొగాకు మరో 40 మిలియన్ కేజీలు రైతుల వద్ద ఉన్నట్లు బోర్డు అధికారుల అంచనా. గతేడాది కూడా ఇలాగే అధికార, అనధికార ఉత్పత్తి మొత్తం కలిపి 130 మిలియన్ కేజీలు కొనుగోలు చేసినట్లు బోర్డు అధికారులు ధ్రువీకరిస్తున్నారు. ఈ సంవత్సరం ఇంకా కొనుగోళ్లకు అదనంగా ఉన్న 40 మిలియన్ కేజీలు కలుపుకుంటే మొత్తం 139 మిలియన్ కేజీలు కొనుగోలు చేయాల్సి ఉంది. రైతుల వద్ద ఉన్న 40 మిలియన్ కేజీలు కొనుగోలు చేసేందుకు రాష్ట్రంలోని పొగాకు బోర్డు ఢిల్లీ బోర్డుకు లేఖ రాసినట్లు తెలిసింది. ఢిల్లీ నుంచి అనుమతి వస్తే రైతుల వద్ద అదనంగా ఉన్న 40 మిలియన్ కేజీలు కొనుగోలుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమవుతుంది.

తొమ్మిది కేంద్రాల్లో ముగిసిన కొనుగోళ్లు...

పొగాకు కొనుగోళ్లు ఈ ఏడాది ఫిబ్రవరి 24న ప్రారంభం కాగా, మొదటి రోజే కేజీ పొగాకు ధర రూ.230 పలికింది. వారం కిందటే 9 వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి చేశారు. ప్రస్తుతం పొదిలి, టంగుటూరు కేంద్రాల్లో మాత్రమే కొనుగోళ్లు జరుగుతున్నాయి. అదనపు పొగాకు కొనుగోళ్లకు అనుమతిస్తే మళ్లీ జిల్లాలో ఉన్న 11 వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా 11 వేలం కేంద్రాల పరిధిలో 2022–23 ఏడాది పొగాకు సీజన్‌లో వేలంలో రికార్డు ధరలు వచ్చాయి. కేజీ పొగాకు సరాసరిన రూ.214 వరకు ధర పలికింది. దీంతో రైతులకు గత సీజన్ సిరులు కురిపించింది. ఈ నేపథ్యంలో 2023–24 ఏడాదిలో కూడా పొగాకు పంట భారీగా సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. అందుకు అనుగుణంగానే 11 వేలం కేంద్రాల పరిధిలో దాదాపు 72 వేల హెక్టార్లలో పొగాకు పంట సాగైంది. 2022–23 ఏడాదిలో 68 వేల హెక్టార్ల సాగు ఉంటే ఇది ప్రస్తుతం 72 వేల హెక్టార్లకు పెరిగింది. గతేడాది కంటే దాదాపు 4 వేల హెక్టార్లలో ఎక్కువగా సాగైంది.

ఒక్కో బ్యారన్‌కు రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షలపైనే లాభాలు...

ఈ సంవత్సరం పొగాకు సాగుచేసిన రైతుల్లో ఒక్కో బ్యారన్‌కు రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల మధ్య లాభం వచ్చినట్లు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో బ్యారన్‌కు సరాసరిన 6 నుంచి 8 ఎకరాల మధ్య పొగాకు సాగు చేస్తారు. ఆ లెక్కన ప్రతి ఎకరానికి కనీసం రూ.లక్షకు తగ్గకుండా లాభాలు వచ్చినట్లు బోర్డు అధికారుల వద్ద కొనుగోళ్ల గణాంకాలు చెబుతున్నాయి. గత రెండు సంవత్సరాలపాటు నాణ్యమైన పొగాకుతో పాటు లోగ్రేడ్, మీడియం గ్రేడ్‌కు కూడా మంచి ధర రావడంతో ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు గతంలో కంటే ఎక్కువ విస్తీర్ణంలో పొగాకు సాగు చేశారు. పొలాలను, బ్యారన్‌లను ఎక్కువ మొత్తంలో ధర చెల్లించి కౌలుకు తీసుకుని మరీ సాగు చేశారు.

అదనపు పొగాకు కొనుగోళ్ల కోసం ఎదురు చూపులు...

బోర్డు అనుమతినికి మించి అదనంగా ఉత్పత్తి చేసిన పొగాకు రైతుల వద్ద 40 మిలియన్ కేజీలు ఉన్నట్లు అంచనా కాగా, అందులో 20 మిలియన్ కేజీలు నాణ్యమైన పొగాకు, 10 మిలియన్ కేజీలు లోగ్రేడ్, మరో 10 మిలియన్ కేజీలు మీడియం గ్రేడ్ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అనుమతికి మించి సాగు చేశారు కాబట్టి దానిని కొనుగోలు చేయాలంటే తప్పనిసరిగా కేంద్రస్థాయిలో పొగాకు బోర్డు అధికారుల అనుమతి తప్పనిసరి. దానిలో భాగంగానే అదనంగా ఉన్న పొగాకును కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అది రాగానే రైతుల వద్ద ఉన్న అదనపు పొగాకు 40 మిలియన్ కేజీలు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు రైతులకు అధికారులు భరోసా ఇస్తున్నారు.

రికార్డు స్థాయి ధరలు నమోదు

పొగాకు చరిత్రలో ఈ ఏడాది మార్కెట్ రికార్డు సృష్టించింది. కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.366, కనిష్టంగా రూ.205, సగటు ధర రూ.305 చొప్పున పలికింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లో కొనుగోలుదారులు పోటీపడి మరీ పొగాకు కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలుదారుల మధ్య పోటీతో 41 వ్యాపార సంస్థలు వేలంలో పాల్గొంటున్నాయి, టంగుటూరు, కొండపి, ఒంగోలు 1, 2, వెల్లంపల్లి వేలం కేంద్రాల్లో అత్యధిక ధరలు నమోదయ్యాయి.

వేలం కేంద్రాల వారీగా వివరాలు...

వేలం కేంద్రం	బేళ్లు	గరిష్ట ధర	కనిష్ట ధర	సగటు ధర
టంగుటూరు	79,090	366	205	305.91
కొండపి	78,804	362	204	260.93
ఒంగోలు – 1	79,186	362	200	260.19
ఒంగోలు – 2	60,483	357	204	251.25
వెల్లంపల్లి	65,279	364	205	261.29

ఈ ధరలు ఊహించలేదు...



మార్కెట్లో ఈ ధరలు ఊహించలేదు. కిలో రూ.400 వరకు పోతుందనుకుంటున్నాం. ఇప్పటి వరకు రూ.366 పలికింది. దీని ప్రభావం వచ్చే సీజన్లో పడే అవకాశం ఉంది. ఇప్పటికే భూములు, బ్యారన్ కౌలు అధికంగా తీసుకుంటున్నారు. ఎరువులు, కూలీల ఖర్చులు పెరుగుతాయి. ఈ సంవత్సరం ఎకరాకు రూ.5 లక్షల ఆదాయం వచ్చింది.

– సింగమనేని బ్రహ్మయ్య, రైతు, మర్లపాడు గ్రామం, టంగుటూరు మండలం

పొగాకు అధిక గిరాకీ...



మార్కెట్లో పొగాకుకు మంచి ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో మన పొగాకుకు ఎక్కడా లేని గిరాకీ పలుకుతోంది. రైతులు ఆశించినదానికంటే ఎక్కువ ధర వచ్చింది. రైతులు పచ్చిరొట్ట పైర్లు నాటుకుని పొలాలు కలియదున్ని రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి.

– శ్రీనివాసరావు, టంగుటూరు వేలం నిర్వహణాధికారి

అనుమతి కోసం ఎదురుచూస్తున్నాం..

రైతులు అదనంగా పండించిన 40 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేసేందుకు అనుమతి రాగానే రైతుల నుంచి కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభిస్తాం. ఇప్పటికే రైతుల వద్ద నుంచి 189.12 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేశారు.

– ఆర్.లక్ష్మణరావు, ఆర్ఎం, టుబాకో బోర్డు, ప్రకాశం జిల్లా

అధైర్యపడొద్దు అండగా ఉంటాం



వైఎస్సార్ సీపీ విద్యుత్ ప్రభపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దారవీడు: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడవద్దని అండగా ఉంటానని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలో తంగిరాలపల్లి పంచాయతీ తమ్మడపల్లి గ్రామంలో శ్రీమాలకొండస్వామి ఉరుసు సందర్భంగా గురువారం రాత్రి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. తొలుత ఎమ్మెల్యే శ్రీమాలకొండస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పూలమాల, శాలువలతో ఘనంగా కార్యకర్తలు సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడుతూ ఎవరికి ఎప్పుడు ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు వచ్చినా అందరం ఐక్యతతో ఎదుర్కొందామని అన్నారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు, ప్రజలు, మహిళల ఆదరాభిమానాలకు ఎప్పుడూ రుణపడి ఉంటానన్నారు. పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి జై వైఎస్సార్, జై జగన్ అంటూ నినాదాలతో ఈలలు వేస్తూ ఆనందోత్సవాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు తోకల ఆవులయ్య, సర్పంచ్‌లు తోకల నాగమల్లీశ్వరి, పాలగిరి రామాంజనేయరెడ్డి, అంగిరేకుల ఆదినారాయణరెడ్డి, నాయకులు వెన్నా శివ కృష్ణారెడ్డి, గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మూల సత్యనారాయణరెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, కంచర్ల కేశయ్య, గోపాలకృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి

- కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా



విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా

ఒంగోలు సెంట్రల్: విద్యుత్ సరఫరా, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. ప్రకాశం భవన్‌లో శుక్రవారం జిల్లా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఆ శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని విద్యుత్ సబ్ స్టేషన్లు వాటి సామర్థ్యం, ప్రస్తుతం విద్యుత్ లభ్యత, డిమాండ్, ఫీడర్ లైన్స్ తదితర అంశాలపై ఆరా తీశారు. గృహ వినియోగం, పరిశ్రమలు, వ్యవసాయం, ఆక్వా సాగుకు విద్యుత్ సరఫరా చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సంస్థలకు ఆదాయం, బకాయిలు, ఎస్సీ, ఎస్టీ, ఇతర బలహీన వర్గాలకు విద్యుత్ సబ్సిడీ, ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు, ప్రయోజనాలపైన కలెక్టర్ సమీక్షించారు. వివిధ విభాగాల్లో సిబ్బంది వివరాలు, ఖాళీలు అడిగి తెలుసుకున్నారు. సౌర విద్యుత్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వివరించాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ, ఈఈలు టీ హైమావతి, పీ శ్రీనివాసులు, డీఈఈ క్రిష్ణకాంత్, ట్రాన్స్ కో ఎస్ఈ కే శ్రీనివాస్, డీఈఈ డీ శ్రీనివాస్, నెడ్‌క్యాప్ పీడీ వీ క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాకు ఉపాధ్యాయులను ఇవ్వరా?



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని అంబవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు.. తమకు ఉపాధ్యాయులను కేటాయించాలంటూ శుక్రవారం నిరసన తెలిపారు. పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు 200 మంది ఉంటే.. ప్రస్తుతం తెలుగు సబ్జెక్టుకు ఇద్దరు, సైన్స్‌కు ఒక ఉపాధ్యాయుడున్నారు. వాస్తవానికి 12 మంది ఉపాధ్యాయులు ఉండాల్సిన ఉండగా కేవలం ముగ్గురే ఉండటంతో తమ చదువులు ఎలా సాగుతాయంటూ చిన్నారులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎంఈఓ జె.ప్రసాదరావును వివరణ కోరగా వర్క్ అడ్జెస్టమెంట్ కింద ఒకరిని పాఠశాలకు కేటాయించామని, మరో ఇద్దరిని త్వరలో కేటాయిస్తామన్నారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని మోటార్ సైక్లిస్టు మృతి



సంఘటన స్థలంలో చిన్ననరసింహులు మృతదేహం

పామూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని మోటార్ సైక్లిస్టు మృతిచెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి పామూరు మండలం లోని భూమిరెడ్డిపల్లె – రావిగుంటపల్లె గ్రామాల మధ్య 565వ నంబర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్సై ఎం.సైదుబాబు తెలిపిన వివరాల ప్రకారం ... కనిగిరి మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన రేగలగడ్డ చిన్ననరసింహులు డోజర్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం రాత్రి బైక్‌పై ప్రయాణిస్తున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్ననరసింహులు (35) అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

గంజాయి నేరస్తులకు జైలు శిక్ష



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

- ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

ఒంగోలు టౌన్:

అమాయక విద్యార్థులు, యువకులకు గంజాయి విక్రయించే వారికి జైలు శిక్ష తప్పదని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ హెచ్చరించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొద్ది రోజులుగా పట్టుకున్న గంజాయి కేసుల వివరాలు వెల్లడించారు. కొద్దిరోజుల్లోనే విస్తృతంగా తనిఖీలు నిర్వహించం ద్వారా 25 మందిని అరెస్టు చేసి వారి నుంచి 8.91 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మొత్తం 6 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు విక్రయించి సొమ్ము చేసుకోవాలని అమాయకుల జీవితాలతో ఆటలాడుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షణకాలం సంతోషం కోసం నూరేళ్ల జీవితాన్ని పాడుచేసుకోవద్దన్నారు. బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని విద్యార్థులు, యువకులకు హితవు పలికారు. జిల్లాలో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 14500, స్థానిక పోలీసులు, డయల్ 112, 100కుగానీ వాట్సాప్ నంబర్ 9121102266కుగానీ తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

వారం రోజుల్లో 361 సెల్‌ఫోన్లు పట్టివేత...

దొంగతనానికి గురైన, పోగొట్టుకున్న 361 సెల్‌ఫోన్లను వారం రోజుల్లో పట్టుకుని బాధితులకు అప్పగించినట్లు ఎస్పీ సుమిత్ సునీల్ తెలిపారు. వాటి విలువ సుమారు రూ.50,54,000 వరకు ఉంటుందని తెలిపారు. ఇటీవల సెల్‌ఫోన్లు రికవరీకిగానూ 8 ప్రత్యేక బృందాలను నియమించి తక్కువ వ్యవధిలోనే 361 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరు మొబైల్ ఫోన్ల దొంగలను, వాటిని కొనుగోలు చేసే 5 మొబైల్ షాపుల యజమానులను అరెస్టు చేసినట్లు చెప్పారు. దీనికి సంబంధించి 3 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు వెల్లడించారు. అపరిచిత వ్యక్తుల నుంచి మొబైల్ ఫోన్లు కొనుగోలు చేయకూడదని, ఎవరైనా ప్రస్తుత మార్కెట్ ధరకంటే తక్కువ ధరకు మొబైల్ ఫోన్లను విక్రయిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. తక్కువ ధరకు వస్తుంది కదా అని దొంగతనానికి గురైన ఫోన్లు కొనుగోలు చేస్తే ఆ తర్వాత పోలీసుస్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తుందని హెచ్చరించారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నవారు వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలని చెప్పారు. ఫిర్యాదు అందిన వెంటనే సదరు మొబైల్ ఫోన్‌ను బ్లాక్ చేయడం జరుగుతుందని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఫోన్‌ను గుర్తిస్తామని ఎస్పీ వివరించారు. పోర్టల్‌ను వినియోగించడం తెలియని వారు పోలీసుస్టేషన్లో సంప్రదించాలని సూచించారు. అలాగే కస్టమర్ల నుంచి ఫోన్లను కొనుగోలు చేసే ముందు షాపు యజమానులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏదైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అన్నీ దుకాణాలలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. విలేకరుల సమావేశంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైం) ఎస్‌వీ శ్రీధర్‌రావు, ఒంగోలు డీఎస్పీ కిశోర్‌బాబు, సీఐలు షేక్ అల్లీ సాహెచ్, జగదీష్, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు చెయిన్ స్నాచింగ్

- వృద్ధురాలి మెడలో గొలుసు లాక్కెళ్లిన దుండగుడు

సింగరాయకొండ: పట్టపగలు చెయిన్ స్నాచింగ్ సంఘటన సింగరాయకొండలో కలకలం సృష్టించింది. ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును దుండగుడు లాక్కెళ్లడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. ఆ వివరాల ప్రకారం.. మండలంలోని బింగినపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు కేశవరపు రమణమ్మకు అనారోగ్యంగా ఉండటంతో శుక్రవారం ఉదయం కందుకూరులోని ఆస్పత్రికి వెళ్లింది. సాయంత్రం తిరుగు ప్రయాణంలో సింగరాయకొండలోని బాలయోగినగర్ వద్ద బస్సు దిగింది. అక్కడి నుంచి తెలిసిన కుర్రాడి మోటారుసైకిల్‌పై సింగరాయకొండలోని గోపాల్‌నగర్‌లో ఉంటున్న తన స్నేహితురాలు కుంచాల వెంకటరత్నం ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో వెంకటరత్నం ఇంటికి తాళం వేసి ఉండటంతో ఆమెకు ఫోన్ చేసింది. నేను ఇంటికి వస్తున్నాను..వేచి ఉండు అని వెంకటరత్నం చెప్పడంతో ఆ ఇంటి మెట్లపై కూర్చుని ఫోన్ మాట్లాడుతూ స్నేహితురాలి కోసం రమణమ్మ ఎదురుచూస్తోంది. ఆ సమయంలో ఓ దుండగుడు ఇంటి గోడ దూకి రమణమ్మ వద్దకు వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. మూడు సవర్ల గొలుసు విలువ సుమారు రూ.1.30 లక్షలు ఉంటుందని బాధితురాలు రమణమ్మ తెలిపింది.ఆ మేరకుపోలీసులకు ఫిర్యాదు చేసింది.

హత్య కేసు నిందితుడిపై అత్యాచారం, అట్రాసిటీ కేసులు నమోదు

యర్రగొండపాలెం: స్థానిక అంబేద్కర్‌నగర్ శ్మశాన వాటికలో జరిగిన వృద్ధురాలి హత్య కేసులో నిందితుడిపై అత్యాచారం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు కూడా నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. 2024 ఫిబ్రవరి 7వ తేదీ అంబేద్కర్‌నగర్‌కు చెందిన తూమాటి చెన్నమ్మ (78) బహిర్భూమికి వెళ్లింది. అక్కడ ఆమె అత్యాచారానికి, హత్యకు గురైంది. సంఘటన స్థలానికి సమీపంలో ఉన్న వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో పనిచేస్తున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ జిల్లాలోని తీర్థ గ్రామానికి చెందిన సుసేన్ కాశ్యప్‌ను నిందితుడిగా గుర్తించి పోలీసులు అరెస్ట్ చేశారు. రిమాండ్‌లో ఉన్న నిందితుడు బీసీ లోహర్ కులస్తుడు కావడం వలన అతనిపై హత్య, అత్యాచారం కేసులతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసినట్లు మార్కాపురం డీఎస్పీ బాలసుందర్ తెలిపారు. త్వరలో కోర్టుకు చార్జిషీట్ దాఖలు చేస్తామని చెప్పారు.

ఫెడెక్స్ కొరియర్ పేరుతో మోసాలపై జాగ్రత్త

- ఎస్పీ సుమిత్ సునీల్

ఒంగోలు టౌన్: మీ పేరుతో పంపిన ఫెడెక్స్ కొరియర్‌లో డ్రగ్స్ ఉన్నాయని, సీబీఐ, కస్టమ్స్, విజిలెన్స్, ఇన్వెస్టిగేషన్ ఆఫ్ బ్యూరో పేరుతో ఎవరైనా ఫోన్లు చేసి బెదిరిస్తే భయపడి డబ్బులిచ్చి మోసపోవద్దని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ సూచించారు. ఇలా ఏదైనా లా ఎన్ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నుంచి అధికారులు ఎవరూ ఫోన్లు చేయరని, స్థానిక పోలీసులను సంప్రదించకుండా మిమ్మల్ని అరెస్టు చేయడం జరగదని స్పష్టం చేశారు. ఇలా ఎవరైనా ఫోన్ చేసి బెదిరిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఇటీవల జరుగుతున్న అనేక ఆన్‌లైన్ మోసాల తరహాలోనే కొత్తగా ఫెడెక్స్ ఫ్రాడ్ కాల్ స్కామ్ జరుగుతోందని ఎస్పీ వివరించారు. వివిధ మార్గాల్లో సేకరించిన ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి మోసాలకు పాల్పడటం జరుగుతుందన్నారు. పోలీసుల మాదిరిగానే డ్రస్ వేసుకుని ముందుగా సేకరించిన వివరాలు చెబుతూ మోసగిస్తున్నారన్నారు. ఇలాంటి మోసాలపై జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద కాల్ వచ్చినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. హెల్ప్ లైన్ నంబర్ 1930కి ఫోన్ చేయాలని, లేకపోతే నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

- పాఠశాలలను సందర్శించిన డీఈఓ సుభద్ర



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ సుభద్ర

చీమకుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని జిల్లా విద్యాశాఖాధికారి డీ సుభద్ర సూచించారు. చీమకుర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలతో పాటు ఎంఆర్‌సీ కార్యాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా ఆమె సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన స్టూడెంట్ కిట్లను పరిశీలించారు. కిట్‌లో ఉండాల్సిన బుక్స్, యూనిఫాం, షూ, తదితర సామగ్రి అంతా ఉందా..లేదా..? అని అడిగి తెలుసుకున్నారు. నూతన సిలబస్ ప్రకారం విద్యార్థులు అర్థం చేసుకునేలా విద్యా బోధన జరగాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఎంఆర్‌సీ కార్యాలయంలో నాడు–నేడు పనుల పురోగతి, ప్రస్తుతం ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కే శివాజీ, హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



సంఘటన స్థలంలో బాలచందు మృతదేహం

మద్దిపాడు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన జాతీయ రహదారిపై మద్దిపాడు మండలంలోని ఏడుగుండ్లపాడు వద్ద గురువారం రాత్రి 11 గంటల సమయంలో చోటుచేసుకుంది. మండలంలోని పెదకొత్తపల్లి గ్రామానికి చెందిన పూనూరి బాలచందు (24) ఒంగోలు బజాజ్ ఫైనాన్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ఏడుగుండ్లపాడు సమీపంలోకి వచ్చేసరికి నెల్లూరు నుంచి విజయవాడవైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అకస్మాత్తుగా ఆగింది. బస్సు వెనుకే వస్తున్న బాలచందు అదుపుతప్పి బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే బాలచందు మృతి చెందాడు. వెనుక వస్తున్న ప్రయాణికులు బస్సును ఆపే ప్రయత్నం చేసినా.. బస్సు డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అందించిన సమాచారంతో బస్సును బొల్లాపల్లి టోల్‌గేటు వద్ద నిలిపివేశారు. మద్దిపాడు పోలీసులు బొల్లాపల్లి టోల్‌గేటు వద్దకు వెళ్లి బస్సును సీజ్ చేసి మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. బాలచందు మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కి తరలించి పోస్టుమార్టం నిర్వహించి శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మద్దిపాడు ఎస్సై మహేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గేట్ల మరమ్మతుల్లో జాప్యం చేయొద్దు

- గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను పరిశీలించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

మద్దిపాడు: గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్ల మరమ్మతుల్లో జాప్యం చేయొద్దని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. మద్దిపాడు మండలంలోని మల్లవరం కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ జలాశయాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ప్రస్తుతం గేట్ల పరిస్థితి, ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వ, నీటి సరఫరా వ్యవస్థపై అధికారులను వివరాలడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రిజర్వాయర్ గేట్లకు జరుగుతున్న మరమ్మతులపై ఆరా తీశారు. ఆగస్టు నెలాఖరులోపు అన్ని గేట్లు పూర్తి స్థాయిలో అమర్చి నీరు నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 12 గేట్లకు శాండ్ బ్లాస్టింగ్ చేస్తున్నట్లు కలెక్టర్‌కు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆమె దిశానిర్దేశం చేశారు. ప్రాజెక్టు కింద నీటి సరఫరా, భూ సేకరణ అంశాల గురించి ఇరిగేషన్ ఎస్ఈ నాగమురళీమోహన్ కలెక్టర్‌కు వివరించారు. ప్రాజెక్టు కుడికాలువ కింద 28 వేల ఎకరాలకు నీరందించేలా పూడికలు తీసి పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసినట్లు తెలిపారు. ఎడమ కాలువ కింద భూసేకరణకు సమస్యలు తలెత్తడంతో వర్క్ ఆర్డర్‌ను ప్రభుత్వం రద్దు చేసిందని కలెక్టర్‌కు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీఓ జీవీ సుబ్బారెడ్డి, తహసీల్దార్ అనూరాధ, ఇరిగేషన్ ఈఈ కె.నాగరాజు, ఏఈఈ వై.రామాంజనేయులు, పలువురు ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కంభం మెడికల్ షాపుల్లో మత్తు మందుల విక్రయాలు

- మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు, ఇన్‌చార్జి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంధ్య వెల్లడి
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే చర్యలు తప్పవని హెచ్చరిక

ఒంగోలు టౌన్: కంభం ఆర్టీసీ బస్టాండులోని పలు మెడికల్ షాపుల్లో మత్తు మందులు విక్రయిస్తున్నట్లు ఇటీవల జరిపిన తనిఖీల్లో తేలిందని మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు, ఇన్‌చార్జి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పీబీ సంధ్య తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిబంధనలకు వ్యతిరేకంగా కంభం ఆర్టీసీ బస్టాండులోని పి.హరిప్రసాద్‌కు చెందిన మహేశ్వరి మెడికల్ షాపు, వైవీ శ్రీనివాసరావు, వైవీ బాలేశ్వరరావుకు చెందిన బాలాజీ మెడికల్ షాపుల్లో జోల్ ఫ్రెష్ 10 ఎంజీ మందులు విక్రయిస్తున్నట్లు తెలిపారు. మహేశ్వరి మెడికల్ షాపులో జోల్ ఫ్రెష్ 10 ఎంజీ స్ట్రిప్స్‌లో 6 స్ట్రిప్లను విక్రయించారని, వాటికి సంబంధించి బిల్లులను హెచ్–1 రిజిస్టర్‌లో నమోదు చేయలేదని తెలిపారు. బాలాజీ మెడికల్ షాపులో 50 స్ట్రిప్‌లకుగానూ 32 స్ట్రిప్‌లను విక్రయించారని, వాటి తాలూకు సేల్స్ బిల్లులు చూపించలేదని చెప్పారు. మందుల విక్రయాలకు సంబంధించి బిల్లులను సక్రమంగా నిర్వహించడం లేదని, డాక్టర్ ప్రిస్కిప్షన్లు లేకుండానే మందులు విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ దుకాణాల్లో గడువు తీరిన మందులను కూడా గుర్తించినట్లు చెప్పారు. దీంతో షాపు యజమానులకు షోకాజు నోటీసులిచ్చి లైసెన్స్‌లను తాత్కాలికంగా ఆపేసినట్లు తెలిపారు. మెడికల్ షాపుల యజమానులు నియమ నిబంధనల ప్రకారం మందులు విక్రయించాలని, కాలం చెల్లిన మందులు, నిషేధిత మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాలువలోకి దూసుకెళ్లిన అంబులెన్స్



క్రేన్ సహాయంతో అంబులెన్స్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

సింగరాయకొండ: ప్రమాదవశాత్తూ ఓ ప్రైవేటు అంబులెన్స్ కాలువలోకి దూసుకెళ్లి నీటిలో మునిగింది. ఈ సంఘటన శుక్రవారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై సింగరాయకొండ మండల పరిధిలోని పెరల్ డిస్టిలరీ సమీపంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి చెందిన అంబులెన్స్ పేషెంట్‌ను తీసుకొచ్చి తిరిగి వెళ్తోంది. పెరల్ డిస్టిలరీ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న మోటారు సైకిలిస్టు అకస్మాత్తుగా వేగం తగ్గించాడు. అతన్ని తప్పించబోయిన అంబులెన్స్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న ఆంబోతువరవ కాలువలోకి దూసుకెళ్లింది. అయితే, ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. శుక్రవారం సాయంత్రం అంబులెన్స్‌ను క్రేన్ సహాయంతో బయటకు తీసి తరలించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని, తమ వద్ద ఎటువంటి సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

పొగాకు కేజీ గరిష్ట ధర రూ.365

- రెండు కేంద్రాల్లోనే బేళ్ల కొనుగోలు
- ఒంగోలులో చూర కొనుగోలు



పొదిలి పొగాకు బోర్డులో వేలానికి సిద్ధంగా ఉన్న బేళ్లు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో కేజీ పొగాకు ధర శుక్రవారం గరిష్టంగా రూ.365 పలికిందని ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. పొదిలి, టంగుటూరు రెండు వేలం కేంద్రాల్లో మాత్రమే శుక్రవారం పొగాకు అమ్మకాలు జరిగాయని చెప్పారు. ఒంగోలు వేలం కేంద్రంలో చూర కొనుగోలు జరుగుతోందన్నారు. రీజియన్ పరిధిలోని రెండు కేంద్రాల్లో 2,662 బేళ్లు వేలానికి రాగా, వాటిలో 2,097 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 235 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. టంగుటూరు కేంద్రంలో 104వ రోజు వేలంపాటలో 1,064 బేళ్లు వేలానికి రాగా, 971 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 93 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఇక్కడ కేజీ గరిష్ట ధర రూ.365, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.317.44 పలికింది. పొదిలి కేంద్రంలో 99వ రోజు వేలం పాటలో 1,268 బేళ్లు వేలానికి రాగా, 1126 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 142 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.361, కనిష్ట ధర రూ.204, సరాసరి రూ.298.72 పలికింది. ఒంగోలులో చూర కొనుగోలు చేస్తుండగా, 481 బేళ్లు వేలానికి వచ్చాయి. వాటిలో 460 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేసి 21 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు.

జాతీయ స్థాయి పోటీల్లో కాళంగికి తృతీయ బహుమతి



బహుమతి అందుకుంటున్న శ్రీనివాసరావు

మార్కాపురం: ఒంగోలులో రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఏకపాత్రాభినయ పోటీల్లో మార్కాపురం పట్టణానికి చెందిన ప్రముఖ నటుడు, పంచాయతీ కార్యదర్శి కాళంగి శ్రీనివాసులు తృతీయ బహుమతి సాధించారు. పౌరాణిక విభాగంలో శకుని శపథం పాత్రతో ఆయన మెప్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులును కోడి రామ్మూర్తి క్రీడా సంఘం అధ్యక్షుడు పిన్నిక నాగేశ్వరరావు, జిల్లా బాక్సింగ్ కోచ్ వేణు, తర్లుపాడు ఎంపీడీఓ చంద్రశేఖరరావు, ఈఓఆర్డీ బాలకృష్ణ అభినందించారు. శ్రీనివాసులుకు రంగ భూమి కళాకారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.హరిబాబు, ఎ.ప్రసాద్, దేనువుకొండ సుబ్బయ్య బహుమతి అందించారు.



శకుని పాత్రలో కాళంగి శ్రీనివాసరావు

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

- 64 సర్వీసులకు రూ.2.90 లక్షల జరిమానా



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు

పామూరు: విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ విజిలెన్స్ ఈఈ కట్టా వెంకటేశ్వర్లు, కనిగిరి ఆపరేషన్ ఈఈ ఎం.హరిబాబు హెచ్చరించారు. పామూరు మండలంలో శుక్రవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు, విద్యుత్ సిబ్బంది 27 బృందాలుగా ఏర్పడి 1,264 సర్వీసులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికలోడు వినియోగిస్తున్న సర్వీసులను గుర్తించి మాల్‌ప్రాక్టీస్ కేసులు, విద్యుత్ చౌర్యం కేసుల కింద మొత్తం 64 సర్వీసులకు రూ.2.90 లక్షల జరిమానా విధించినట్లు ఈఈ హరిబాబు తెలిపారు. దాడుల్లో కనిగిరి సబ్‌డివిజన్ డీఈఈ ఆర్.ఉమాకాంత్, పామూరు సబ్‌డివిజన్ డీఈఈ టి.శ్రీకాంత్, విద్యుత్ విజిలెన్స్ డీఈఈ శ్రీనివాసరావు, పామూరు ఏఈ జిలాని, డివిజన్ పరిధిలోని ఏఈలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి మృతి

యర్రగొండపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి మృతి చెందాడు. యర్రగొండపాలెం మండలంలోని అమానిగుడిపాడుకు చెందిన చేవూరి సుబ్రహ్మణ్యాచారి (14) పదో తరగతి చదువుతున్నాడు. కుటుంబ పనుల నిమిత్తం తల్లిదండ్రులతో కలిసి ఆటోలో గురువారం మార్కాపురం వెళ్తున్నాడు. ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొని పెద్దారవీడు మండలంలోని తోకపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం వేకువజామున మృతిచెందాడు. ఈ ప్రమాదంలో గాయాలపాలైన ఆ విద్యార్థి తల్లిదండ్రులు కూడా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.